




రైతులను చెదరగొడుతున్న పోలీసులు

మద్దతు ధరపై రైతన్న దిగాలు



వరి విక్రయాలకు ముందుకురాని రైతులు

గడువు ముగుస్తున్నా... ప్రారంభం కాని కొనుగోళ్లు

అయోమయంలో అన్నదాతలు

వ్యాపారులకే నేరుగా వరి విక్రయాలు

బెంగళూరు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) పథకంలో భాగంగా రైతుల నుంచి వరి, రాగులు, జొన్న కొనుగోళ్ల ప్రక్రియ ఇంకా ప్రారంభం కానేలేదు. కొనుగోళ్లకు ఇచ్చిన గడువు ముగియడానికి 20 రోజులే మిగిలడంతో రాష్ట్రంలో లక్ష లాది మంది రైతుల పరిస్థితి అయోమయంగా మారింది. ప్రస్తుత ఏడాది రాష్ట్రంలో ఎంఎస్‌పీ పథకం ద్వారా 5.99 లక్షల టన్నుల రాగులు, 2.5 లక్షల టన్నుల వరి, 3 లక్షల టన్నుల తెల్ల జొన్న కొనుగోలు కోసం 2023 నవంబరులోనే అనుమతి మంజూరైంది. రైతుల రిజిస్ట్రేషన్, ఏకీకృత లబ్ధిదారుల సమాచార వ్యవస్థ (ఫ్రూట్)లో డిసెంబరు 1 నుంచి 31వరకు మద్దతు ధరతో విక్రయాలు చేయదలిచే రైతుల పేర్లను నమోదు చేశారు. ఇందులో 3,279 క్వింటాళ్ల వరి విక్రయించేందుకు 118 మంది రైతులు, 37,77,878 క్వింటాళ్ల రాగులు విక్రయించేందుకు 1,65,418 మంది రైతులు, 3,31,049 క్వింటాళ్ల తెల్లజొన్నలు విక్రయించేందుకు 8,089 మంది రైతులు పేర్లను నమోదు చేసుకున్నారు. మద్దతు ధరకు వీటిని కొనుగోలు చేసేందుకు ఇంకా మూడు వారాల గడువే మిగిలి ఉంది. అవసరమైతే గడువును మరింతగా పెంచుతామని వ్యవసాయ శాఖ మంత్రి ఎన్.చెలువరాయస్వామి నగరంలో సోమవారం మీడియాకు చెప్పారు. రైతులెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.

మూడు సంస్థలకు కొనుగోలు బాధ్యతలు

మద్దతు ధరకు ఆహార ధాన్యాల కొనుగోలు బాధ్యతను మూడు సంస్థలకు అప్పగించారు. కర్ణాటక పౌర ఆహార సరఫరాల కార్పొరేషన్‌కు 16 జిల్లాలు, రాష్ట్ర సహకార విక్రయ మహామండలికి 9 జిల్లాలు, కర్ణాటక రాష్ట్ర వ్యవసాయ విక్రయ మండలికి 6 జిల్లాల బాధ్యతలను అప్పగించారు. ఈ మూడు సంస్థలు మద్దతు ధరకు ఆహార ధాన్యాలను కొనుగోలు చేసేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసుకున్నా సాంకేతిక సమస్యల కారణంగానే జాప్యం జరుగుతోందని అధికారులు అంటున్నారు.

మద్దతు ధరకు రాష్ట్రంలో 25 లక్షల క్వింటాళ్ల వరికొనుగోలు చేసేందుకు అవకాశం ఉన్నా రైతులెవరూ ముందుకురావడం లేదని వ్యవసాయ శాఖ అధికారి ఒకరు వెల్లడించారు. కరువు కారణంగా ఈసారి కల్యాణ కర్ణాటక, ఉత్తర కర్ణాటక ప్రాంతాల్లో వరిదిగుబడి బాగా తగ్గడమే ఇందుకు కారణమని భావిస్తున్నట్లు చెప్పారు. పైగా మార్కెట్ బియ్యం ధరలు ప్రతినెలా పెరుగుతూనేఉండటంతో మద్దతు కన్నా ఇంకా అధిక ధర లభిస్తుందనే ఆశతో రైతులు ఉన్నట్లు తెలుస్తోంది. ఎ- గ్రేడ్ వరి క్వింటాలు రూ.2,203, సామాన్య వరికి క్వింటాలు ధర రూ.2,183గా ఖరారుచేశారు. రైస్‌మిల్లర్లు ఇంత కంటే అధిక ధర చెల్లించేందుకు సిద్ధంగా ఉన్నట్లు సమాచారం. ఇక హైబ్రీడ్ తెల్ల జొన్నలకు క్వింటాలు మద్దతు ధరను రూ.3,180గా ఖరారు చేశారు. మేలురకం తెల్ల జొన్నల మద్దతు ధర క్వింటాలు రూ.3,225, రాగులకు మద్దతు ధరను క్వింటాలు రూ.3,846గానూ ఖరారు చేసినట్లు అధికారులు తెలిపారు. రైతుల పేరుతో అక్రమంగా మద్దతు ధరకు విక్రయించేందుకు దళారులు సిద్ధమయ్యారని, ఈ కొనుగోలు కేంద్రాల వద్ద గట్టి నిఘా విధించాలని రైతులే పూర్తిగా ప్రయోజనం పొందేలా చూడాలని సర్వోదయ పార్టీ ఎమ్మెల్యే దర్శన్ పుట్టణ్ణయ్య ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఇంకా కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కానందున గడువు పెంచాలని ఆయన కోరారు. ఈ గడువు మార్చి 31తో ముగియనున్నందున త్వరలోనే పొడిగింపు ఆదేశాలు రావచ్చునని రైతాంగం ఎదురు చూస్తోంది.



బ్యాడిగి ఏపీఎంసీ మార్కెట్‌లో కాలిబూడిదైన ఫైరింజన్

మిరప రైతుల కన్నెర్ర

- బ్యాడిగి ధర తగ్గిందని ఏపీఎంసీ కార్యాలయం ధ్వంసం
- వాహనాలు, ఫైరింజన్‌కు నిప్పు



ఏపీఎంసీ మార్కెట్‌కు నిప్పుపెట్టిన దృశ్యం

బెంగళూరు/బళ్లారిరూరల్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని హావేరి జిల్లా బ్యాడిగి ఏపీఎంసీ మార్కెట్ మిర్చి పంటకు పేరుగాంచింది. ఈ మార్కెట్‌కు రాష్ట్రంలోని బళ్లారి, విజయనగరం జిల్లాలతో పాటు ఆంధ్రలోని అనంతపురం, కర్నూలు, కడప తదితర జిల్లాల నుంచి బ్యాడిగి ఏపీఎంసీ మార్కెట్‌కు పంటను తీసుకు వస్తుంటారు. బ్యాడగి రకం మిరప ఒక్కసారిగా ధర తగ్గిపోవడంతో ఆగ్రహానికి లోనైన అన్నదాతలు కన్నెర్రజేశారు. బ్యాడగి ఏపీఎంసీ కార్యాలయాన్ని ధ్వంసం చేశారు. కార్యాలయ ప్రాంగణంలోని వాహనాలకు నిప్పు పెట్టారు. హావేరి జిల్లా బ్యాడగి ఏపీఎంసీ కార్యాలయానికి సోమవారం పెద్ద ఎత్తున రైతులు మిరప పంటతో వచ్చారు. గత వారం దాకా క్వింటాలు రూ.20వేలు ధర పలికింది. సోమవారం ఒక్కసారిగా రూ.12వేలకు తగ్గిపోవడంతో రైతుల్లో ఆగ్రహం కట్టలు తెంచుకుంది. ధర ఎందుకు తగ్గిందని మార్కెట్ కమిటీ అధికారులను ప్రశ్నించారు. రాష్ట్రంలోనే కాకుండా దేశమంతటా కరువు నెలకొందని, ఖరీఫ్‌లో పంట సాగు తక్కువని అయినా ఒక్కసారిగా ధరలు వ్యాపారులకు అనుకూలం చేస్తే ఎలాగని ప్రశ్నించారు. అనంతపురం, కడప, చిత్తూరు జిల్లాల నుంచి మిర్చి పంటను తీసుకువస్తే కనీసం రవాణా ఖర్చులు కూడా రావడం లేదని వాపోయారు. తీవ్ర వాగ్వాదం సాగుతున్న తరుణంలో ఆవేశానికి లోనైన కొందరు ఫర్నీచర్‌ను ధ్వంసం చేశారు. కార్యాలయ అద్దాలను పగులగొట్టారు. కార్యాలయ ప్రాంగణంలోని వాహనాలకు నిప్పు పెట్టారు. మంటలు ఆర్పేందుకు వచ్చిన ఫైరింజన్‌కు సైతం నిప్పుపెట్టారు. ఈ దాడిలో దాదాపు ఐదు కార్లు, ఒక ఫైరింజన్ మంటల్లో కాలి బూడిదయ్యాయి. పలువురు రైతులకు కూడా గాయాలయ్యాయి. పోలీసులు, రైతుల మధ్య తీవ్ర ఘర్షణ చోటు చేసుకోవడంతో సోమవారం మార్కెట్‌ను మూసివేశారు. విషయం తెలుసుకున్న వెంటనే బ్యాడగి పోలీసులు తరలివచ్చారు. రైతులను శాంతింపచేసేందుకు సాహసం చేయాల్సి వచ్చింది. సమీప స్టేషన్ల నుంచి పోలీసు బలగాలను రప్పించారు.



ఆందోళన చేస్తున్న రైతులు

చెన్నై - మైసూరు వందేభారత్ రైలుకు

నేడు ప్రధాని మోదీ పచ్చజెండా

వర్చువల్ ద్వారా ప్రారంభం



బెంగళూరు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మైసూరు- ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ మధ్య నడిచే వందేభారత్ స్పెషల్ రైలుకు ప్రధాని నరేంద్రమోదీ మంగళవారం వర్చువల్ ద్వారా పచ్చజెండా చూపనున్నారు. ప్రస్తుతం మైసూరు రైల్వేస్టేషన్‌లో నిర్వహణా పనులు జరుగుతున్నందున ఈ రైలు ఎస్ఎంవీటీ - చెన్నై మధ్య సంచరిస్తుందని నైరుతి రైల్వే నగరంలో సోమవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపింది. మార్చి 14 నుంచి ఏప్రిల్ 4 వరకు ఈ రైలు రెగ్యులర్‌గా సంచరించనుంది. ఏప్రిల్ 5 నుంచి ఈ వందేభారత్ రైలు మైసూరు - చెన్నై మధ్య సంచరిస్తుందని ప్రకటనలో పేర్కొన్నారు. 20663 నెంబరు రైలు మైసూరులో ప్రతిరోజూ ఉదయం 6 గంటలకు బయల్దేరి చెన్నైకు మధ్యాహ్నం 12.25కు చేరుకోనుంది. ఈ రైలుకు మండ్య, కేఎస్ఆర్ బెంగళూరు, కృష్ణరాజపురం, కాట్పాడిలో స్టాప్‌లు ఉంటాయి. బుధవారం మాత్రం ఈ రైలు సంచారం ఉండదు. తిరుగుప్రయాణంలో ఈ రైలు చెన్నైలో ప్రతిరోజూ సాయంత్రం 5 గంటలకు బయల్దేరి అదే రోజు రాత్రి 11-20కు మైసూరుకు చేరుకోనుంది. ఈ రైలు సేవలు బుధవారం ఉండవని రైల్వే ప్రకటన పేర్కొంది. అంతవరకు ఈ రైలు బెంగళూరు ఎస్ఎంవీటీలో బుధవారం మినహా మిగిలిన అన్ని రోజుల్లోనూ ఉదయం 7.50కు బయల్దేరి చెన్నైకు మధ్యాహ్నం 12-25కు చేరుకుంటుంది. ఈ రైలు కృష్ణరాజపురం, కాట్పాడిలో మాత్రమే ఆగుతుంది. తిరుగు ప్రయాణంలో చెన్నయ్‌లో సాయంత్రం 5 గంటలకు బయల్దేరి అదే రోజు రాత్రి 9-30కు ఎస్ఎంవీటీకి చేరుకోనుంది.

డీకే సురేశ్‌పై డాక్టర్ మంజునాథ్ పోటీ

నేడో రేపో అధికారిక ప్రకటన



డీకే సురేశ్



డాక్టర్ సీఎన్ మంజునాథ్

బెంగళూరు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు గ్రామీణ లోక్‌సభ నియోజకవర్గంలో తిరుగులేని నేతగా రాణిస్తూ వరుసగా విజయం సాధిస్తున్న డీకే సురేశ్‌కు దీటైన అభ్యర్థిని రంగంలోకి దించేలా బీజేపీ, జేడీఎస్ కసరత్తు చేస్తున్నాయి. డీకే సురేశ్ తొలి సారిగా బెంగళూరు గ్రామీణ నుంచి 2013 ఉప ఎన్నికల్లో విజయం సాధించారు. ఆ తర్వాత 2014లో తిరుగులేని మెజారిటీ పొందారు. 2019లో జరిగిన ఎన్నికల్లో రాష్ట్రం నుంచి ఎన్నికైన ఏకైక కాంగ్రెస్ ఎంపీగా నిలిచారు. రానున్న ఎన్నికల కోసం కాంగ్రెస్ పార్టీ మరోసారి డీకే సురేశ్‌ను అభ్యర్థిగా ప్రకటించింది. ఆయన దాదాపు నాలుగైదు నెలలుగా నియోజకవర్గ వ్యాప్తంగా పర్యటనలు సాగిస్తున్నారు. ఇదే స్థానం నుంచి బీజేపీ-జేడీఎస్ ఉమ్మడి అభ్యర్థిగా పద్మశ్రీ గ్రహీత, ప్రముఖ వైద్యుడు, జయదేవ ఆసుపత్రుల డైరెక్టర్‌గా వ్యవహరించిన సీఎన్ మంజునాథ్‌ను బరిలోకి దించడానికి పరిశీలిస్తున్నారు. రెండు నెలలుగా మంజునాథ్ పేరు ప్రస్తావనలో ఉన్నా ఆయన రాజకీయాల్లోకి వచ్చేందుకు సుముఖత చూపకపోవడంతో ఖరారు కాలేదు. కేంద్రంలో మరోసారి బీజేపీ విజయం సాధ్యమనే సర్వేలు నిర్ధయిస్తున్న వేళ డాక్టర్ మంజునాథ్‌ను ఎన్నికల్లో పోటీ చేయించడం ద్వారా సరికొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టేలా బీజేపీ, జేడీఎస్ వ్యూహం పన్నాయి. దశాబ్దాన్నరకాలంగా జయదేవ ఆసుపత్రుల డైరెక్టర్‌గా వ్యవహరించిన మంజునాథ్ రాష్ట్ర ప్రజలందరికి చిరపరిచితుడు. దేశంలో ఎక్కడా లేని విధంగా మొదట వైద్యం ఆ తర్వాత ఫీజు అనే నినాదంతో వైద్యం అందించారు. డాక్టర్ మంజునాథ్ పట్ల పార్టీలకు అతీతంగా అన్నివర్గాల ప్రజలు ప్రత్యేక అభిమానం చూపుతారు. దీంతో డీకే సురేశ్‌కు దీటుగా ఎదుర్కోనాలంటే డాక్టర్ మంజునాథ్ సమర్థవంతుడని ఎంపిక చేశారు. బీజేపీ తొలి జాబితాలోనే ఆయన పేరు ఖరారయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

గ్యారెంటీ పథకాల లబ్ధిదారులతో రేపు సీఎం సమావేశం

చింతామణి, మార్చి 11: చింతామణి పట్టణ శివారులోని కోలారు రోడ్డు ఆంజనేయస్వామి దేవస్థానం సమీపాన రాష్ట్ర ప్రభుత్వ గ్యారెంటీ పథకాల లబ్ధిదారుల సమావేశం ఈనెల 13న జరగనుంది. బుధవారం సమావేశానికి ము ఖ్యమంత్రి సిద్దరామయ్య ముఖ్యఅతిథిగా పాల్గొంటారని తాలూకా బ్లాక్ కాం గ్రెస్ అధ్యక్షుడు మురగమల్లా లక్ష్మినారాయణరెడ్డి తెలిపారు. సోమవారం ఆ యన సమావేశ ఏర్పాట్లను పర్యవేక్షించిన అనంతరం మీడియాతో మాట్లాడు తూ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న గ్యారెంటీ పథకాల లబ్ధిదారులతో సమావేశమవుతారని వివరించారు.



ఇందిరా క్యాంటీన్‌ను ప్రారంభించి రుచిని పరిశీలిస్తున్న సీఎం సిద్దరామయ్య

అనంతకుమార్ హెగ్డే వ్యాఖ్యలతో

బీజేపీలో కలకలం

ఎన్నికల వేళ కొత్త తలనొప్పి... ఆ వ్యాఖ్యలు వ్యక్తిగతమంటూ వివరణ



బెంగళూరు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): కేంద్ర మాజీ మంత్రి, ఉత్తరకన్నడ బీజేపీ లోక్‌సభ సభ్యుడు అనంతకుమార్ హెగ్డే రాజ్యాంగాన్ని మారుస్తామంటూ చేసిన వ్యాఖ్యలు బీజేపీలో కలకలం రేపుతున్నాయి. లోక్‌సభ ఎన్నికల వేళ పార్టీకి ఇవి తలనొప్పిగా పరిణమించాయి. ఈ వ్యాఖ్యలను అధికార కాంగ్రెస్ బ్రహ్మాస్త్రంగా మలచుకుంటే దళిత ఓట్లపై దెబ్బ పడుతుందేమోనని పార్టీ శ్రేణులు ఆందోళన చెందుతున్నాయి. కాగా అనంతకుమార్ హెగ్డే వ్యాఖ్యలతో ఏర్పడ్డ నష్టాన్ని భర్తీ చేసుకునే దిశలో బీజేపీ నేతలు కసరత్తు చేపట్టారు. తమ పార్టీ ఎంపీ వ్యాఖ్యలు పూర్తిగా వ్యక్తిగతమని, పార్టీతో సంబంధం లేదని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.రాజీవ్ పేర్కొన్నారు. బెంగళూరు మల్లేశ్వరంలోని బీజేపీ ప్రధాన కార్యాలయంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ అనంతకుమార్ హెగ్డే వ్యాఖ్యలతో బీజేపీకి ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. ప్రధాని నరేంద్రమోదీ రాజ్యాంగానికి తలవంచి నమస్కరించి పార్లమెంటులోకి అడుగుపెట్టిన సంగతిని గుర్తు చేశారు. కాగా రాష్ట్ర పార్టీ అధికార ప్రతినిధి, ఎమ్మెల్సీ చలవాది నారాయణ స్వామి కూడా అనంతకుమార హెగ్డే వ్యాఖ్యలను ఖండించారు. బీజేపీకి అంబేడ్కర్ తత్వ సిద్ధాంతాలపై పూర్తిగా విశ్వాసం ఉందన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ దేశ రాజ్యాంగం మారదని భరోసా ఇచ్చారు. ఇలాంటి వివాదాస్పద వ్యాఖ్యలతో పార్టీకి ఇబ్బంది కలిగించే పరిస్థితి సృష్టించిన ఆయనపై అధిష్ఠానం పెద్దలే సరైన నిర్ణయం తీసుకుంటారని అన్నారు. అభివృద్ధి అజెండాతోనే లోక్‌సభ ఎన్నికలను ఎదుర్కొంటామని, 400 స్థానాలు అంతకంటే ఎక్కువ గెలిచినా రాజ్యాంగం పదిలంగా ఉంటుందని, మార్పు ఆలోచన తమకు ఏమాత్రం లేదని స్పష్టం చేశారు. కాగా అనంతకుమార్ హెగ్డే వ్యాఖ్యలను రాష్ట్ర పార్టీ అధిష్ఠానం పెద్దల దృష్టికి తీసుకెళ్లిందని, త్వరలో జాతీయ స్థాయి నేతలు కూడా ఖండించే అవకాశం ఉందని తెలుస్తోంది.



అనంతకుమార్ హెగ్డే

దేశంలో నియంత తరహా పాలన

రాజ్యాంగాన్ని నాశనం చేసేపనిలో బీజేపీ, ఆర్ఎస్ఎస్

పేదవాడి ఆకలి తీర్చడమే మా లక్ష్యం : సిద్దరామయ్య

దేవనహళ్లి విమానాశ్రయంలో ఇందిరా క్యాంటీన్ ప్రారంభం



వడ్డిస్తున్న సీఎం

బెంగళూరు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): దేశంలో నియంత తరహా పరిపాలన ప్రారంభించాలన్నదే బీజేపీ, ఆర్ఎస్ఎస్ సంకల్పమని ముఖ్యమంత్రి సిద్దరామయ్య మండిపడ్డారు. బెంగళూరు నగర శివారులోని దేవనహళ్లిలో గల కెంపేగౌడ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఏర్పాటు చేసిన ఇందిరా క్యాంటీన్‌ను ఆయన సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం ప్రసంగిస్తూ తమ ప్రభుత్వం పేద ప్రజల కన్నీళ్లు తుడుస్తూ ఆకలి తీరుస్తుంటే బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లు రాజ్యాంగాన్ని సర్వనాశనం చేసే పనిలో పడ్డాయని విరుచుకుపడ్డారు. ఆర్ఎస్ఎస్ మద్దతు లేకుండా బీజేపీ ఎంపీ అనంతకుమార్ హెగ్డే రాజ్యాంగమార్పుపై కీలక వ్యాఖ్యలు చేయడం అసాధ్యమన్నారు. ఇకనైనా దేశప్రజలు, లౌకికవాదులు మేల్కోవాలని పిలుపునిచ్చారు. దేశంలో నిరుపేదల సంక్షేమంపై బీజేపీకి ఏమాత్రం ఆసక్తి లేదన్నారు. మనుస్మృతిని అమలు చేసేందుకే లోక్‌సభలో తమకు 400 సీట్లు ఇవ్వాలని బీజేపీ కోరుతోందన్నారు. ఆర్ఎస్ఎస్ మద్దతు బలంగా ఉన్న అనంతకుమార్‌హెగ్డేపై చర్యలు తీసుకునే దమ్ము, ధైర్యం బీజేపీకి లేవన్నారు. ఎన్నికల వేళ బీజేపీ, ఆర్ఎస్ఎస్ నిజస్వరూపం బయటపడిందన్నారు. బెంగళూరు సహా రాష్ట్ర వ్యాప్తంగా 600 ఇందిరా కాంటీన్లను ప్రారంభించే ఆలోచన ఉందన్నారు. అన్నభాగ్య పథకాన్ని మరింత విజయవంతంగా, పక్కాగా అమలు చేసే ఉద్దేశ్యంతోనే పౌర, ఆహార సరఫరాలశాఖకు నూతన భవంతిని ఏర్పాటు చేశామన్నారు. విమానాశ్రయానికి రోజూ వందల సంఖ్యలో వచ్చే క్యాబ్ డ్రైవర్లు, కార్మికులకు ఇక్కడి ఇందిరాక్యాంటీన్ వరప్రసాదం కానుందన్నారు. త్వరలోనే మరో ఇందిరా క్యాంటీన్‌ను ప్రారంభిస్తామన్నారు. ఈ ఇందిరాక్యాంటీన్‌లలో రూ. 5కే టిఫిన్, రూ. 10కే భోజనం అందుబాటులో ఉంటుందన్నారు. తనకు తెలిసి దేశంలోని ఏ విమానాశ్రయంలోనూ ఇంత చౌకగా భోజనం లభించడం లేదన్నారు. కులమతాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలు గ్యారెంటీ పథకాల ప్రయోజనం పొందుతున్నారని పేర్కొన్నారు. మరో జన్మ ఉంటే ముస్లింగా పుడతానని గతంలో చెప్పిన మాజీ ప్రధాని దేవెగౌడ ఇప్పుడు బీజేపీతో అంటకాగుతున్నారని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్‌తోపాటు పలువురు మంత్రులు హాజరయ్యారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1584.54	1,600.03
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	000	00
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	2,041	7,887
సామర్థ్యం (టీఎంసీలు)	7.03	21.56

రాముడు నడయాడిన ఆనెగొంది

ఎమ్మెల్యే గాలి జనార్దన్‌రెడ్డి.. ఉత్సవాలకు శ్రీకారం

గంగావతి రూరల్, మార్చి 11: పురాణాల్లోనే ఆనెగొంది గ్రామానికి ఎంతో చరిత్ర ఉందనీ, పురాణాల ప్రకారం రాముడు నడయాడిన గడ్డగా చరిత్రలో నిలిచిపోయిందని గంగావతి ఎమ్మెల్యే గాలి జనార్దన్‌రెడ్డి అన్నారు. సోమవారం నుంచి రెండు రోజుల పాటు జరిగే ఆనెగొంది ఉత్సవాలను సోమవారం ఎమ్మెల్యే లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం అక్కడ వేదికపై నుంచి ఎమ్మెల్యే గాలి జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ.. ఆంజనేయుడు పుట్టిన గడ్డగా ఈ ప్రదేశం ఖ్యాతి వహించిందన్నారు. వానర సైన్య స్థావరం అయిన కిష్కింధ కూడా ఇక్కడికి దగ్గరలో ఉండడం విశేషమన్నారు.

అలాగే హంపీ నగ రానికి ఆనుకుని ఉండే తుంగభద్ర నదిపక్కన ఉండే ఆనెగొందికి పురాణాల ప్రకారం ఎంతో గుర్తింపు ఉందన్నారు. ఇక్కడ రాఘవేంద్ర స్వామి గురువులు జీవసమాధి చెందారని, అలాగే రామలక్ష్మణులు సీత కోసం అన్వేషించిన స్థావరాలు, రాముడి రాక కోసం శబరి ఎదురు చూసిన గుహ, వాలిసుగ్రీవుల యుద్ధ సమయంలో రాముడు నిల్చున్న స్థావరం ఇలా అనేక పుణ్య స్థలాలకు ఆనెగొంది నిలయంగా నిలిచిందని ఎమ్మెల్యే గాలి జనార్దన్‌రెడ్డి అన్నారు. ఇక నుంచి ప్రతి ఏటా ఆనెగొంది ఉత్సవాలు ఘనంగా జరుపుకుంటామని తెలిపారు. సోమవారం నుంచి రెండు రోజుల పాటు ఉత్సవాలు జరుపుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో వీరిపాటు గాలి లక్ష్మిఅరుణ, శ్రీకృష్ణదేవరాయ వంశస్తులు పాల్గొన్నారు.



ఉత్సవాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గాలి జనార్దన్‌రెడ్డి



అంబారీలో స్వామివారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే

అంబరాన్ని అంటిన సంబరాలు: ఆనెగొంది ఉత్సవాల్లో భాగంగా ఏనుగుల సవారీ, కళాకారుల ప్రదర్శన, సాంస్కృతిక కార్యక్రమాలు చోటుచేసుకున్నాయి. వివిధ ప్రాంతాల నుండి కళాకారులతోపాటు ప్రజలు పెద్ద ఎత్తున ఈ ఉత్సవాల్లో పాల్గొన్నారు.

రైతు భూములపై అధికారుల దౌర్జన్యానికి నిరసనగా ధర్నా

పావగడ, మార్చి 11: తాలూకా వ్యాప్తంగా 1978 నుంచి రైతులు సాగు చేస్తున్న భూములకు ప్రభుత్వం పట్టాదారు పాసుపుస్తకాలు అందించినప్పటికీ వాటిని అటవీ శాఖ అధికారులు స్వాధీనం చేసుకోవాలనుకునే ప్రయత్నాలను రైతు సంఘం ఖండించింది. ఈ భూములు ఫారెస్టుకు చెందినవని, వెంటనే వాటిని వదిలిపెట్టాలని రైతులపై చేస్తున్న దాడులకు నిరసనగా తాలూకా రైతు సంఘం పావగడలో సోమవారం పెద్దఎత్తున ధర్నా చేపట్టింది. తాలూకాలోని పళవల్లి, కామనదుర్గ, హొసహళ్లితండా, నాగలమడక గ్రామాల్లో రైతులు సాగుచేసుకొన్న భూములను చట్టబద్ధంగా అన్ని హక్కులు ఉన్నప్పటికీ కొందరు రాజకీయ నాయకుల ఒత్తిళ్లతో మరొకరి పేరిట రిజిస్టర్ చేయించడానికి అటవీ శాఖ అధికారులు రైతులను హింసించడం ఏమాత్రం సమంజసం కాదని రైతు సంఘం అధ్యక్షులు పూజారప్ప తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. పావగడ ప్రభుత్వ ఆస్పత్రిలో సరైన వైద్యులు, వైద్యసౌకర్యాలు లేక ఎందరో అభాగ్యులు ప్రాణాలు కోల్పోతున్నారని, ఈవిషయంపై ఎమ్మెల్యే సహకరించకపోవడం దారుణమైన విషయం అని తెలిపారు. తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని రైతు సంఘం నాయకులు, మహిళా రైతులు రెవిన్యూ శాఖ మంత్రికి అందజేయాలని కోరుతూ ఏసీకి అందజేశారు.

స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయండి



స్పీడ్ బ్రేకర్లు లేని ఆదోని రోడ్డు

సిరుగుప్ప, మార్చి 11 : సిరుగుప్ప పట్టణంలోని ఆదోని రోడ్డు మార్గంలో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని విజయనగర కాలనీవాసులు పీడబ్ల్యూడీ అధికారులను కోరుతున్నారు. సిరుగుప్ప నుంచి రారావి వరకు జాతీయ రహదారి పనులు పూర్తిచేసి యేడాది గడుస్తున్నా ఇంతవరకు స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయకపోవడం హాస్యాస్పదంగా వుందన్నారు. కాలనీవాసులు అధికారులకు పలు సార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని వాపోయారు. ప్రమాదాలు నివారించాలంటే తక్షణమే ఆ కాలనీలో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని కోరారు.

ఓవర్‌లోడ్ ట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలి



అధికలోడుతో వెళ్తున్న ట్రాక్టర్

సిరుగుప్ప, మార్చి 11: అధిక లోడుతో వెళ్లే ట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని స్థానికులు ఆర్టీఓ అధికారులను కోరుతున్నారు. సిరుగుప్ప తాలుకా వ్యాప్తంగా ట్రాక్టర్లు అధిక లోడుతో తిరుగుతుండడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. పోలీసులు వీటిపై చర్యలు తీసుకుంటున్నా ఓవర్‌లోడుతో వెళ్లడం తగ్గలేదన్నారు. కావున అధికారులు ఈ విషయంపై విచారించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కమ్మ భవన నిర్మాణానికి ముండ్లూరు సాయం మరవలేనిది

● కమ్మ సంఘం నాయకుడు అమర్‌నాథ్ చౌదరి ● బళ్లారి కమ్మ మహాజన సంఘం ఆధ్వర్యంలో ప్రముఖులకు సన్మానం

బళ్లారి, మార్చి 11(ఆంధ్రజ్యోతి): బళ్లారిలో కమ్మ భవనం నిర్మాణం కోసం మాజీ మంత్రి ముండ్లూరు రామప్ప కుమారుడు ముండ్లూరు అనూప్ కుమార్ చేసిన సహాయం కమ్మకులస్థులు ఎన్నటికీ మరవలేరని అమర్‌నాథ్ చౌదరి పేర్కొన్నారు. కమ్మభవనం అసంపూర్తిగా ఉన్న సమయంలో ముండ్లూరు అనూప్ తన ఆస్తులు బ్యాంకులో తాకట్టు పెట్టి కమ్మభవనం నిర్మాణానికి ఆర్థిక సహాయం చేశారన్నారు. కమ్మ భవన నిర్మాణంలో ముండ్లూరు అనూప్ కుమార్ కృషిని వారు ఈ సందర్భంగా కొనియాడారు. బళ్లారి కమ్మ మహాజన సంఘం ఆధ్వర్యంలో సోమవారం కమ్మభవనంలో వివిధ హోదాల్లో ఉన్న కమ్మ వారికి సన్మాన కార్యక్రమం నిర్వహించారు. బుడా అధ్యక్షుడు జేఎస్ ఆంజనేయులు, కర్ణాటక రాష్ట్ర న్యాయవాదుల బార్ కౌన్సిల్ సభ్యులు, రాఘవకళామందిరం అధ్యక్షుడు కే. కోటేశ్వరరావు, న్యాయవాదులు వి. జనార్దన్, ఎన్. సుధాకర్, కార్పొరేటర్లు ముండ్లూరు పద్మ, ముండ్లూరు ప్రభంజన్, ముల్లంగి నందీష్, పి.విక్కీ, ఎం.రామాంజినేయులు లను సన్మానించారు. అనంతరం సంఘ నాయకులు ముల్లంగి చంద్రశేఖర్ చౌదరి, జీ. ప్రభాకర్ నాయుడు, దామోదర్ చౌదరి, అమరేంద్రనాథ్ చౌదరి, గుర్రం లాల్‌మోహన్ మాట్లాడారు. వివిధ పదవుల్లో ఉన్న కమ్మకులస్తులు సంఘంతో పాటు సమాజం అభివృద్ధికి తోడ్పడాలని కోరారు. అందరూ ఐక్యమత్యంగా ఉన్నపుడే ఏదైనా సాధించడానికి వీలవుతుందన్నారు. బళ్లారిలో ఇంతకు ముందు రాజకీయంగా కమ్మ కులస్తులకు బాగా గుర్తింపు ఉండేదన్నారు. ముండ్లూరు రామప్ప లాంటి నాయకులు మంత్రిగా, ఎమ్మెల్యేగా కంగా 35 ఏళ్ల పాటు బళ్లారిలో రాజకీయంగా మంచి పేరు తెచ్చుకున్నారన్నారు. ప్రస్తుతం మన వాళ్లు వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా పోటీ చేయాలని కోరారు. వీరితోపాటు బాబూ ప్రకాష్, కుడితిని రాము, చిమ్మిలి ప్రకాష్, మార్గదర్శి రమేష్, పుల్లయ్య, చంద్రశేఖర్, వైకుంటం ఇందిరా, మాధవీలత, కంది బ్యాళ్ల ఉమేష్, అభిలాష్ శ్రీనివాసులు, బీమనేని ప్రసాద్, కేపీ సురేష్‌బాబు, కే. మోహన్, తదితరులు పాల్గొన్నారు.



కమ్మ ప్రముఖులను సన్మానిస్తున్న దృశ్యం

చంద్రబాబునాయుడు సీఎం కావడం తథ్యం

గుమ్మనూరు జయరామ్



సమావేశంలో మాట్లాడుతున్న గుమ్మనూరు జయరామ్

బళ్లారి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో జరుగబోయే ఎన్నికల్లో జనసేన, బీజేపీ, టీడీపీ కూటమి అఖండ మెజార్టీతో గెలుస్తుందనీ, ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకారం చేస్తారని మాజీ మంత్రి గుమ్మనూరు జయరామ్ పేర్కొన్నారు. ఆయన సోమవారం బళ్లారిలో మాట్లాడుతూ వైఎస్సార్ ప్రభుత్వంతో జనం విసుగెత్తి పోయారని పేర్కొన్నారు. చంద్రబాబు నాయుడుకు కర్నూలు జిల్లాతో పాటు అనంతపురం జిల్లాలో కూడా ప్రభావం వుంటుందని, ఖచ్చితంగా అనంతపురం, కర్నూలు జిల్లాల్లో పర్యటించి తెలుగుదేశం గెలుపుకు కృషి చేస్తారని తెలిపారు. గుంతకల్లు నుంచి పోటీ చేయాలని తనను కోరినట్లు తెలిపారు.

హైవే పనులను ప్రారంభించనున్న ప్రధాని: ఎంపీ వెల్లడి

రాయచూరు, మార్చి 11 : జిల్లా మీదుగా నిర్మించే రెండు జాతీయ రహదారి పనుల ప్రారంభంతో పాటు కలబుర్గి నుంచి బెంగళూరుకు వెళ్లే వందే భారత్ రైలును ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్‌గా ప్రారంభిస్తారని రాయచూరు ఎంపీ రాజా అమరేశ్వర్ నాయక్ తెలిపారు. సోమవారం నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో విలేఖరులతో ఎంపీ మాట్లాడారు. రూ.99 వేల కోట్లతో దేశంలో నిర్మిస్తున్న పలు జాతీయ రహదారి పనులను ప్రధాని నరేంద్ర మోదీ గురువారం ద్వారకాలో వర్చువల్‌గా ప్రారంభిస్తారన్నారు. ఇందులో రాయచూరు జిల్లా ద్వారా వెళ్లే 178ఏ జాతీయ రహదారి కూడా ఉన్నట్లు ఆయన వివరించారు.

అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శ్రీకారం



భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెంకటేష్

పావగడ, మార్చి 11: తాలూకా వ్యాప్తంగా రూ.2కోట్ల ఎమ్మెల్యే నిధులతో చేపట్టిన పలు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే హెచ్.వి.వెంకటేష్ సోమవారం ప్రారంభించారు. దొడ్డేనహళ్లి గ్రామంలో రూ.13లక్షలతో నిర్మించిన నూతన భవనాన్ని, వదనకల్లు గ్రామంలో రూ.10లక్షలతో నిర్మించిన సముదాయభవనాన్ని ప్రారంభించారు. వై.ఎన్.హొసకోట జామియామసీదులో రూ.20లక్షలతో సముదాయ భవనానికి, మరో రూ.20లక్షలతో అంగన్‌వాడీ భవన నిర్మాణానికి ఎమ్మెల్యే వెంకటేష్, మాజీ మంత్రి వెంకటరమణప్పలు భూమిపూజ చేశారు. తాలూకాలోని అన్ని సామాజిక వర్గాలతోపాటు మైనారిటీలకు ప్రత్యేకంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడానికి కాంగ్రెస్ పార్టీ ముందంజలో ఉందని ఎమ్మెల్యే తెలియజేశారు.

ఎస్టీ రిజర్వేషన్ పెంపు కోసం కేంద్రానికి సిఫార్సు

రాయచూరు, మార్చి 11 : రాష్ట్ర ప్రభుత్వం ఎస్టీ రిజర్వేషన్‌ను ఏడు శాతానికి పెంచుతూ తీసుకున్న నిర్ణయం అమలు చేయడంతో పాటు 9వ షెడ్యూల్‌లో ఈ అంశాన్ని చేర్చే విషయంపై కేంద్ర ప్రభుత్వానికి తమ పార్టీ శిఫార్సు చేస్తుందని బీజేపీ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి బి.శ్రీరాములు తెలిపారు. సోమవారం జిల్లాకు వచ్చిన ఆయన నగరంలోని టిప్పు సుల్తాన్ గార్డన్‌లో నిర్వహిస్తున్న నిరవధిక నిరాహార దీక్షలో పాల్గొని మాట్లాడారు. జిల్లాకు చెందిన వెంకటేష్ నాయక్ ఆధ్వర్యంలో ఎస్టీల రిజర్వేషన్, రాజ్యాంగ బద్దత అనే సమస్యపై సాగిస్తున్న నిరవధిక నిరాహార దీక్షలు సోమవారం 37వ రోజుకు చేరాయి. దీక్షలను విరమింప చేసిన మాజీ మంత్రి బి.శ్రీరాములు, ఎస్టీలకు రిజర్వేసన్ పరంగా తగిన న్యాయం చేసేందుకు బీజేపీ పూర్తి కట్టుబడి ఉందన్నారు. లోకసభ ఎన్నికల అనంతరం తిరిగి కేంద్రంలో వచ్చేది బీజేపీ ప్రభుత్వమేనని ఎస్టీలకు తగిన న్యాయం జరిగేందుకు తమ పార్టీ నిబద్ధతతో పని చేస్తుందన్నారు. కాగా కొంతమంది అధికారులు జిల్లాలో అనర్హులకు సంబంధం లేని ఇతర కులాల వారికి ఎస్టీ కులధ్రువ పత్రాలు జారీ చేస్తున్నారని ఇలాంటి వారిపై చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వానికి ఫిర్యాదు చేయాలన్నారు.



నిరాహార దీక్షలో పాల్గొని మాట్లాడుతున్న మాజీ మంత్రి శ్రీరాములు

జిమ్ నిర్మాణానికి మంత్రి భూమిపూజ



జిమ్ భవన నిర్మాణానికి భూమి పూజ చేసిన మంత్రి నాగేంద్ర

బళ్లారి, మార్చి 11(ఆంధ్రజ్యోతి): బళ్లారి నగరంలో అత్యాధునిక క్రీడా మైదానం, జిమ్ భవన నిర్మాణాన్ని రూ. 9.50 కోట్లతో నిర్మించేందుకు సోమవారం రాష్ట్ర యువజన క్రీడలు, ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి బి. నాగేంద్ర భూమి పూజ చేశారు. నగరంలోని రాజ్‌కుమార్ రోడ్డు వైపు ఉన్న మున్సిపల్ కళాశాల మైదానంలో వీటి నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. అనంతరం మంత్రి నాగేంద్ర మాట్లాడుతూ జిల్లాలో యువకులు, వృద్ధులు, మహిళలు, వ్యాయామం చేసేందుకు అత్యాధునిక జిమ్ భవనాన్ని నిర్మిస్తున్నామన్నారు. ఇందులో అధునాతన పరికరాలను కూడా సమకూర్చుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బళ్లారి నగర ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి, మేయర్ డి. శ్వేత, డిప్యూటీ మేయర్ బి. జానకి, డి.సీ ప్రశాంత్ కుమార్ మిశ్రా, ఎస్పీ రంజిత్ కుమార్ బండారు. తహసీల్దార్ గురు రాజ్, తదితరులు పాల్గొన్నారు.

రాయితో తలపై మోది మహిళ హత్య

రాయచూరు, మార్చి 11: జిల్లాలోని లింగసుగూరు పట్టణం ఎన్‌జీఓ కాలనీ సమీపంలో సోమవారం 35 ఏళ్ల వివాహిత హత్యకు గురైంది. ఆమె తలపై బలంగా రాళ్లతో కొట్టి చంపిన నిందితుడు అక్కడి నుంచి పరారయ్యాడు. మృతి చెందిన మహిళను యరడోణకు చెందిన గిరిజమ్మగా పోలీసులు గుర్తించారు. యరడోణకు చెందిన గిరిజమ్మకు ఇంతకు పూర్వమే అంకుశదొడ్డి గ్రామానికి చెందిన యువకుడితో వివాహం కాగా రెండేళ్ల క్రితం ఆమె భర్త చనిపోయాడు. పట్టణ సమీపంలో నివశిస్తున్న అదే గ్రామానికి చెందిన మరొక యువకుడు దేవరాజ్ నాయక్(25)తో ఆమెకు వైవాహికేతర సం బంధం ఉన్నట్లు అనుమానిస్తున్నారు. ఈ క్రమంలోనే ఈ హత్య జరిగినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. లింగసుగూరు పోలీసులు మృతదేహాన్ని పోస్ట్‌మార్టం కోసం ఆస్పత్రికి తరలించి దర్యాప్తు చేపట్టారు.

హామీల అమలుతో ప్రజలకు అండగా ప్రభుత్వం: మంత్రి

బళ్లారి, మార్చి 11(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను సక్రమంగా అమలు చేస్తూ ప్రజలకు అండగా నిలుస్తోందని రాష్ట్ర యువజన క్రీడలు, ఎస్టీ సంక్షేమశాఖ మంత్రి బి.నాగేంద్ర పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రకటించిన ఐదు గ్యారెంటీ పథకాల అమలుపై బళ్లారిలోని మోకా రోడ్డు వద్ద సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి బళ్లారి ఎమ్మెల్యే భరత్‌రెడ్డి అధ్యక్షత వహించారు. రాష్ట్ర యువజన క్రీడలు, ఎస్టీ సంక్షేమ శాఖ, బళ్లారి జిల్లా ఇన్‌చార్జి మంత్రి నాగేంద్ర మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను లబ్ధిదారులకు అందిస్తూ ప్రజలకు ఇచ్చిన మాటను నిలుపుకుంటుందన్నారు. బీజేపీ ప్రభుత్వం ప్రభుత్వంపై కేవలం అసత్యఆరోపణలు చేస్తోందని మంత్రి ఆరోపించారు. గృహలక్ష్మి పథకం ద్వారా ప్రతి మహిళకూ నెలకు రూ. 2వేలు, అలాగే ఇంటింటికీ ఉచిత విద్యుత్, ఇలా మొత్తం ఐదు పథకాలు ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయన్నారు. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డి.కే శివకుమార్ పథకాలు అమలు చేసి ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చుతున్నారన్నారు. బళ్లారి నగర ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి మాట్లాడుతూ బళ్లారిలో తాను ఎమ్మెల్యే అయిన తరువాత సుమారు రూ.110 కోట్ల నిధులు మంజూరు చేయించానన్నారు. ఇళ్ల పట్టాలు లేని నగర ప్రజలకు సుమారు 6072 పట్టాలు పంపిణీ కి సిద్ధంగా ఉన్నాయన్నారు. ఎమ్మెల్యే తుకారం మాట్లాడుతూ కేంద్రలో కూడా కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందన్న ఆశాభావాన్ని వ్యక్తంచేశారు. వీరితో పాటు కంప్లి ఎమ్మెల్యే జే.ఎన్ గణేష్, సిరుగుప్ప ఎమ్మెల్యే బి.ఎం, నాగరాజు, మేయర్ డి. త్రివేణి, ఉపమేయర్ జానకి, బుడా అధ్యక్షుడు జేఎస్ ఆంజనేయులు, కలకం పొంపాపతి, ముండ్రిగి నాగరాజు, చానల్ శేఖర్, కాంగ్రెస్ పార్టీ బి- బ్లాక్ అధ్యక్షుడు అబి. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు అన్నా నాగరాజు, కార్పొరేటర్లు గుమ్మనూరు జగన్, ముల్లంగి నందీష్, ముండ్లూరు ప్రభంజన్ కుమార్, రామాంజినేయులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి బి. నాగేంద్ర

హోసూరు జోన్

ఘనంగా కరుణానిధి శతజయంతి వేడుకలు



ప్రముఖులను సన్మానిస్తున్న దృశ్యం

హోసూరు, మార్చి 11: మాజీ ముఖ్యమంత్రి, డీఎంకే నేత కరుణానిధి శతజయంతి వేడుకలు హోసూరులో ద్రావిడ మున్నేట్ర కళగం, హోసూరు ఇళయ నీల సంగీత బృందం సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం రైల్వేరోడ్డులోని మీరా మహల్ వద్ద జరిగాయి. ప్రముఖుల ప్రసంగాల అనంతరం మంగళ సంగీత కార్యక్రమం, జానపద కళారూపాల కార్యక్రమం సందడిగా సాగింది. కార్యక్రమానికి ఎమ్మెల్యే, ఐఎన్‌టీయూసీ జాతీయ కార్యదర్శి మనోహరన్ అధ్యక్షత వహించారు. డీఎంకే కార్యవర్గ సభ్యుడు ఎల్లోరమణి అందరికీ స్వాగతం పలికారు. కాంగ్రెస్ ఎంపీ సెల్లకుమార్, డీఎంకే మైనార్టీ హక్కుల విభాగం ఉపకార్యదర్శి విజయకుమార్. డిప్యూటీ మేయర్ ఆనందయ్య, తళి మాజీ చైర్మెన్ చంద్రప్ప, మండలి అధ్యక్షుడు సెందిల్‌కుమార్‌లు పాల్గొన్నారు. తమిళనాడు ప్రభుత్వ భవేందర్ బారతీదాసన్ అవార్డు గ్రహీత ద్రావిడ ఉద్యమ ఆలోచనపరుడు నాంజిల్ సంపద్ ప్రసంగం ఆకట్టుకుంది. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మురళీధరన్, డీఎంకే ప్రాంతీయ కార్యదర్శి రాము, సాహిత్య బృందం శక్తివేల్, యువజన బృందం సుమన్‌తోపాటు పలువురు పాల్గొన్నారు.

రూ.14.88 కోట్ల పనులకు శ్రీకారం

హోసూరు, మార్చి 11: హోసూరు కార్పొరేషన్ పరిధిలో రూ.14.88కోట్ల విలువైన ప్రాజెక్టు పనులను ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ వర్చువల్ గా సోమవారం ప్రారంభించారు. ధర్మపురిలో ఏర్పాటైన కార్యక్రమంలో హోసూరు మున్సిపల్ కార్పొరేషన్ తారు రోడ్డు పునరుద్ధరణ, సిమెంట్ రోడ్డు నిర్మాణం, వర్షపునీటి పారుదల పనులతో పాటు రూ.14.88 కోట్ల విలువైన పనులను సీఎం ఎంకే స్టాలిన్ ప్రారంభించారు.

ఘనంగా అంగాళపరమేశ్వరీ ఆలయ ఉత్సవం

హోసూరు, మార్చి 11: హోసూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని దేశింగు నగర్‌లో ప్రముఖ అంగాళపరమేశ్వరీ ఆలయంలో పూజల్లో వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. ప్రతి ఏటా మాఘ మాసంలో నిర్వహించే విశేషపూజల్లో అగ్ని గుండంలో భక్తులు నడిచి తమ మొక్కులు చెల్లించుకుంటారు. ఆలయ 16వ వార్షిక ఉత్సవాలు ఈనెల 6న ధ్వజరోహణంతో ప్రారంభమయ్యాయి. రోజూ అమ్మవారికి ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించారు. అనంతరం అంగాళ పరమేశ్వరీ అమ్మవారికి ఐదు రోజుల పాటు వివిధ హోమాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవాల్లో చివరిరోజైన ఆదివారం రాత్రి శ్మశానంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాలుగు రోజులపాటు దీక్ష ఉన్న భక్తులు వివిధ వేషాధారణలతో పూల అలంకరణతో కరగలను మోస్తూ శ్మశానవాటికలోని ఆలయంలోకి చేరుకున్నారు. ఉత్సవాలను తిలకించేందుకు చుట్టుప్రక్కల గ్రామాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. ఆదివారం అర్ధరాత్రి అమ్మవారికి మేకలు, కోళ్లను బలి ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు.



పూల కరగలతో ఊరేగింపుగా వెళ్తున్న భక్తులు

గ్యారెంటీ పథకాల సమావేశానికి లబ్ధిదారులు హాజరుకావాలి



అధికారులతో సమావేశమైన డీసీ చంద్రశేఖర్ నాయక్

రాయచూరు, మార్చి 11 : ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న గ్యారెంటీ పథకాలపై సమీక్ష నిర్వహించేందుకు ఈ నెల 14న ముఖ్యమంత్రి సిద్ధరామయ్య జిల్లాకు రానున్నారని జిల్లాధికారి చంద్రశేఖర్ నాయక్ తెలిపారు. గ్యారెంటీ పథకాల్లో లబ్ధిదారులైన వారు ముఖ్యమంత్రి నిర్వహించే సమీక్ష సమావేశంలో విధిగా పాల్గొనేలా సంబంధిత శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యమంత్రి పాల్గొనే సభకు సంబంధించి సోమవారం సన్నాహక సమావేశం నిర్వహించారు. సమావేశంలో మాట్లాడిన జిల్లాధికారి శాఖల వారిగా లబ్దిదారుల వివరాలు సేకరించి వారంతా సభకు వచ్చేలా ఆయా శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అదే సమయంలో పథకం అమలులో ఎదురయ్యే సమస్యల గురించి వారితో చర్చించాలన్నారు. దీంతో పాటు ప్రారంభానికి సిద్ధమయ్యే పనుల జాబితాను తక్షణం అందజేయాలన్నారు. ముఖ్యమంత్రితో పాటు ఇతర మంత్రులు కూడా జిల్లాకు రానున్న నేపథ్యంలో సంబంధిత శాఖల అభివృద్ధి పనుల వివరాలను అందుబాటులో ఉంచాలన్నారు.


చెరువు అభివృద్ధి పేరుతో నిధుల స్వాహా

రాయచూరు, మార్చి 11 : చెరువు పేరుతో రూ.90 లక్షలకు పైగా నిధులు స్వాహా చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని నమ్మ కర్ణాటక సేనె నాయకులు కోరారు. జిల్లాధికారి కార్యాలయంలో సోమవారం ఈ మేరకు వారు ఫిర్యాదు చేశారు. జిల్లాలోని మాన్వి తాలూకా కురుకుంద గ్రామంలో ఎలాంటి చెరువు లేక పోయినా చెరువు నిర్మించినట్లు రూ.90 లక్షల నిధులు స్వాహాచేసిన నిందితులు అదే చెరువు అభివృద్ధి పేరుతో మరో సారి రూ.18 లక్షల బిల్లులు చేసేందుకు సిద్ధపడుతున్నారనిఆరోపించారు. ఈ విషయంలో చిన్ననీటి పారుదల శాఖ అధికారుల ప్రమేయం కూడా ఉన్నట్లు ఆరోపించిన నమ్మ కర్ణాటక సేనె నాయకులు దీని పై సమగ్ర విచారణ జరిపి దోషులను చట్టపరంగా శిక్షించాలని కోరుతు వినతి పత్రం అందజేశారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాంచ్...

ఎడ్వర్డ్ ఫ్రాంక్లిన్ అల్బీ (జయంతి)



అమెరికాకు చెందిన కథా రచయిత ఎడ్వర్డ్ ఫ్రాంక్లిన్ అల్బీ-3 1928 మార్చి 12న జన్మించారు. ది జూ స్టోరి, ది స్యాండ్‌బాక్స్, హూస్ అఫ్రైడ్ ఆఫ్ వర్జీనియా ఉల్ఫ్, ఏ డెలికేట్ బ్యాలెన్స్, త్రీ టాల్ ఉమెన్ వంటి రచనలు ఎంతో పేరొందాయి. 'పులిట్జర్ ప్రైజ్ ఫర్ డ్రామా', టోనీ అవార్డ్ ఫర్ బెస్ట్ ప్లే అవార్డులు అందుకున్నారు. 'అమెరికన్ థియేటర్ హాల్ ఆఫ్ ఫేం'లో చోటు దక్కించుకున్నారు. ఇతర గౌరవాలు ఒందారు. నాఫ్టా నుంచి గౌరవ డాక్టరేట్ అందుకున్నారు. 2016 సెప్టెంబరు 16న కన్నుమూశారు.

అనిష్ కపూర్ (పుట్టినరోజు)



బ్రిటీష్ భారతీయ శిల్పి సర్ అనిష్ కపూర్ 1954 మార్చి 12న ముంబైలో జన్మించారు. ఇన్‌స్టాలేషన్ ఆర్ట్ అండ్ కాన్సెప్చువల్ ఆర్ట్ ఆయన ప్రత్యేకత. ప్రిమియో డుమిల ప్రైజ్, టర్నర్ ప్రైజ్ యూనిలివర్ కమిషన్ ఫర్ ది టర్బైన్ హాల్, అత్యున్నత పద్మభూషణ్ పురస్కారం, ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ నుంచి గౌరవ డాక్టరేట్ అందుకున్నారు. క్లౌడ్ గేట్ (ది బీన్), పారిస్‌లోని గ్రాండ్ పలాసిస్, ఆర్సిలర్ మిట్టల్ ఆర్బిట్ వంటి డిజైన్‌లు ప్రముఖమైనవి.

శ్రేయ ఘోషల్ (పుట్టినరోజు)



ప్రముఖ నేపథ్య గాయని శ్రేయ ఘోషల్ 1984 మార్చి 12న పశ్చిమబెంగాల్ రాష్ట్రం ముర్షిదాబాద్ జిల్లా దుర్గాపూర్‌లో జన్మించారు. హిందీ సినీ రంగంలో గాయనిగా రాణించారు. కన్నడ, తెలుగు, తమిళం, అస్సామీ, బెంగాలీ, పంజాబీ, మళయాళం బాషలలో కూడా ఎన్నో పాటలు పాడారు. గేయరచయితగా, కంపోజర్‌గా, మ్యూజిక్ ప్రొడ్యూసర్‌గా సత్తా చాటుకున్నారు. సినిమా పాటలు, పాప్ సాంగ్స్, ఘజల్స్, భజనలు, హిందూస్తానీ శాస్త్రీయ సంగీత పాటల్లోనూ ప్రతిభ చాటుకున్నారు. 4 జాతీయ పురస్కారాలు, 5 ఉత్తరాది ఫిల్మ్‌ఫేర్, 4 దక్షిణాది ఫిల్మ్‌ఫేర్ పురస్కారాలు అందుకున్నారు. బుల్లితెరపై సంగీత కార్యక్రమాలకు న్యాయ నిర్ణేతగా వ్యవహరించారు. 2017లో మేడమ్ టస్సాడ్ మ్యూజియంలో మైనపు బొమ్మగా అవకాశం కల్పించడంతో తొలి దేశ గాయనిగా అరుదైను గుర్తింపు పొందారు.

మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్‌పై మైసూరులో హత్యాయత్నం కేసు

బెంగళూరు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ బీకే అల్తాఫ్ ఖాన్‌పై మైసూరు ఉదయగిరి పోలీసుస్టేషన్‌లో హత్యాయత్నం కేసు నమోదయ్యింది. రాష్ట్ర గృహనిర్మాణ శాఖా మంత్రి జమీర్‌అహ్మద్‌ఖాన్‌కు అత్యంత ఆప్తుడిగా పేరొందిన అల్తాఫ్‌ఖాన్‌కు ఇటీవలే కార్పొరేషన్ హోదా లభించగా బాధ్యతలు చేపట్టారు. ఇదే నెల 9న శనివారం మైసూరు రాజీవ్‌నగర్‌లో అక్మల్‌ను దారుణంగా హత్య చేశారు. ఈమేరకు అక్మల్ భార్య నాజియా ఫిర్యాదు మేరకు బీకే అల్తాఫ్‌తో పాటు ఐదుగురిపై కేసులు నమోదు చేశారు. అల్తాఫ్‌కు మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ పదవి వచ్చిన మేరకు మైసూరులో ఈనెల 6న అభినందన సభ జరిగింది. ఇందుకు సంబంధించి శాంతినగర్ వ్యాప్తంగా అల్తాఫ్‌కు సంబంధించిన ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. ఫ్లెక్సీలను తొలగించాలని అక్మల్, మైసూరు మహానగర పాలికె కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. అభినందన సభ వేళ అల్తాఫ్‌తో పాటు బషీర్ తదితరులు అక్మల్‌ను తీవ్రంగా బెదరించారు. దీంతో అల్తాఫ్, బషీర్‌లకు వ్యతిరేకంగా అక్మల్ వీడియో చేసి సోషల్ మీడియాలో పోస్టు చేయగా వైరల్ అయ్యింది. ఇదే కక్షతోనే అక్మల్‌ను దారుణంగా హత్య చేశారని భార్య పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈమేరకు పోలీసులు బీకే అల్తాఫ్‌ఖాన్‌పై ఎ-2గా సోమవారం కేసు నమోదు చేశారు. ఆయనతో పాటు కేసులో బషీర్‌అహ్మద్, పర్వేజ్, ఇబ్రహీం, ఫైజన్ అహమ్మద్‌లు ఉన్నారు. ప్రత్యక్ష సాక్షులు, ప్రాథమిక సమాచారం సేకరించిన తర్వాత పోలీసులు ఆరోపితులకు నోటీసులు జారీ చేసే అవకాశం ఉంది.

నేడు గుంతకల్లు మీదుగా వందే భారత్ రైలు ప్రారంభం

గుంతకల్లు, మార్చి 11: రైల్వే డివిజన్‌లోని వివిధ స్టేషన్ల మీదుగా వెళ్లే వందే భారత్ రైలును ప్రధానమంత్రి మంగళవారం ప్రారంభించనున్నట్లు సీనియర్ డీసీఎం మనోజ్ నాగరాజన్ పేర్కొన్నారు. సోమవారం ఉదయం స్థానిక డీఆర్ఎం కార్యాలయంలోని తన చాంబర్‌లో సీనియర్ డీసీఎం విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మంగళవారం పలు ప్రాజెక్టుల ప్రారంభోత్సవం, మరికొన్నింటికి శంకుస్థాపన చేయనున్నట్లు తెలియజేశారు. అందులో భాగంగా కలబురగి-బెంగళూరు మధ్య వందే భారత్ రైలును ప్రారంభిస్తారన్నారు. ఈ రైలు రైల్వే డివిజన్‌లోని రాయచూరు, మంత్రాలయం, గుంతకల్లు, అనంతపురం, ధర్మవరం స్టేషన్ల మీదుగా వెళ్తుందన్నారు. డివిజన్‌లోని తిరుపతి-కొల్లాం, బెంగళూరు-గుల్బర్గ మధ్య కూడా వందే భారత్ రైళ్లను ప్రారంభించనున్నట్లు తెలియజేశారు. గుంతకల్లు-గుంటూరు సెక్షన్‌లో డబ్లింగ్ కార్యక్రమంలో భాగంగా పాక్షికంగా పూర్తయిన 303 కి.మీ.ల లైన్‌ను జాతికి అంకితం చేయనున్నట్లు తెలిపారు. ఈ రూటులో ఎక్స్‌ప్రెస్ రైళ్లకు గ్రీన్ సిగ్నల్ లభించనుందన్నారు. వన్ స్టేషన్-వన్ ప్రొడక్ట్ పథకం కింద రైల్వే డివిజన్‌లో 23 విక్రయ కేంద్రాలను ప్రారంభించనున్నట్లు తెలియజేశారు. గతి శక్తి కార్గో టెర్మినల్‌గా ప్రారంభమైన నక్కనదొడ్డి ఐసీసీ టెర్మినల్‌లోపాటు, మరో రెండు టెర్మినళ్లను జాతికి అంకితం చేయనున్నారని తెలియజేశారు.

లేపాక్షిలో ముగిసిన బ్రహ్మోత్సవాలు

లేపాక్షి, మార్చి 11: స్థానిక దుర్గావీరభద్ర స్వామి ఆలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు సోమవారంతో ముగిశాయి. ఉదయం దుర్గావీరభద్రస్వాములను ప్రత్యేకంగా అలంకరించి, ప్రత్యేక పూజలు చేశారు. అభిషేకార్చనలు, వసంతోత్సవం, ధ్వజావరోహణం వైభవంగా నిర్వహించారు. నాట్యమండపంలో శివపార్వతులకు శయనోత్సవం చేశారు. దీంతో బ్రహ్మోత్సవాలు ముగిశాయి.

ముత్యాలపల్లకిలో ఊరేగిన ఆది దంపతులు

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా లేపాక్షిలో ఆదివారం రాత్రి ముత్యాల పల్లకిలో ఆది దంపతులు ఊరేగారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ముత్యాలపల్లకిలో శివపార్వతులను అధిష్టించి పురవీధుల్లో ఊరేగించారు. ఉత్సవంలో కీలుగుర్రాల ప్రదర్శన నిర్వహించారు.

గందరగోళం నడుమ 5, 8, 9 పరీక్షలు

బాగేపల్లి, మార్చి 11: గందరగోళం నడుమ 5, 8, 9 తరగతులకు సోమవారం పరీక్షలు ప్రారంభమయ్యాయి. మధ్యాహ్నం 2.30 నుంచి 5.15 వరకు పరీక్షలు సాగాయి. తాలూకాలో 5వ తరగతిలో 5,416మంది ఉండగా 2400మంది హాజరయ్యారు. 8వ తరగతిలో 2379మందికిగాను 2351మంది పరీక్షలు రాశారు. ఇక 9వ తరగతిలో 2462 మందికిగాను 2410మంది రాసినట్టు విద్యాశాఖ అధికారులు తెలిపారు. తొలుత పబ్లిక్ పరీక్షలు నిర్వహించాలని భావించారు. ప్రైవేట్ విద్యాసంస్థల సంఘాలు హైకోర్టును ఆశ్రయించగా ఏకసభ్య ధర్మాసనం పబ్లిక్ పరీక్షలను రద్దు చేసింది. అయితే ప్రభుత్వం మళ్లీ పిటీషన్ వేయడంతో ద్విసభ్య ధర్మాసనం విచారణ చేపట్టి నిర్ణీత గడువు ప్రకారం పరీక్షలు నిర్వహించాలని ఆదేశించింది. అయితే దీన్ని సవాల్ చేస్తూ ప్రైవేట్ విద్యాసంస్థల సంఘాలు సుప్రీంకోర్టును ఆశ్రయించాయి. ఇదిలా ఉండగానే మార్కులను పరిగణనలోకి తీసుకునేలా ఫైనల్ పరీక్షలు సోమవారం ఫస్ట్ లాంగ్వేజ్ కన్నడ పరీక్ష యథా ప్రకారం సజావుగా సాగాయి. తాలూకాలోని 384 కేంద్రాలలో 7257 మందికిగాను 7161 మంది హాజరైనట్టు విద్యాశాఖ వర్గాల ద్వారా తెలుస్తోంది. 5వ తరగతి పరీక్షలు ఈనెల 14వరకు కొనసాగనున్నాయి. 8, 9 పరీక్షలు ఈనెల 18వరకు ఉంటాయి.



నల్లపరెడ్డి పాఠశాలలో పరీక్షలు రాస్తున్న 8వ తరగతి విద్యార్థులు

కేంద్ర, రాష్ట్ర పథకాలపై అవగాహనా సదస్సు



సదస్సు ప్రారంభంలో ప్రముఖులు

బంగారపేట, మార్చి 11: దేశానికి స్వాతంత్ర్యం లభించి ఏడు దశాబ్దాలు గడిచినా స్వావలంబన జీవనం సాధ్యం కావడం లేదని, సామాన్య, మధ్య తరగతి వర్గాల ప్రజల ఆర్థికశక్తి నింపేందుకు ఒక ప్రత్యేక సదస్సు ఏర్పాటు చేసినట్టు ఖాది గ్రామోద్యోగ మండలి రాష్ట్ర డైరెక్టర్ డాక్టర్ మోహన్‌రావ్ పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని బాలాజి కన్వెన్షన్‌హాల్‌లో ఖాది, గ్రామోద్యోగ మండలి బెంగళూరు, ఎస్సీ, ఎస్టీ, వాణిజ్య పారిశ్రామికమండలి సంయుక్త ఆధ్వర్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పలు రాయితీ పథకాల గురించి వివరించారు. సదస్సును ఆయన ప్రారంభించి మాట్లాడుతూ ఆర్థిక భద్రత అనేది జీవితానికి ఒక భరోసాగా ఉంటుందన్నారు. మహిళల స్వావలంబనకోసం ఎన్నో పథకాలు ఉన్నాయని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సరైన మార్గదర్శకంతోనే అవకాశాలు సాధ్యమని, ప్రతి ఒక్కరూ చక్కగా చదువుకుని సంస్కారవంతులు కావాలన్నారు. ఎస్సీ, ఎస్టీ విభాగం ముఖ్యులు కోకిల మాట్లాడుతూ పరిశ్రమలతో ఆర్థికత రెండోస్థానంలో ఉందన్నారు. బట్టల డిజైనింగ్‌లోనూ ఆధునికత ద్వారా డిమాండ్ పెంచుకోవచ్చునన్నారు. సదస్సులో ఖాది గ్రామోద్యోగ మండలి సహాయక డైరెక్టర్ లింగదొరై, రామ్‌ప్రసాద్, ఎస్సీ, ఎస్టీ వాణిజ్య పరిశ్రమల మండలి రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ నేత్రావతి, జిల్లా అధ్యక్షులు శివకుమార్, పీడీఓ సరస్వతి, వాణి తదితరులు పాల్గొన్నారు.

వాతావరణ మార్పులపై

చైతన్యం తీసుకురావాలి

బెంగళూరు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని నగరాలలో వాతావరణంలో పెను మార్పులు చోటు చేసుకుంటున్నాయని అందుకు ఎన్నో కారణాలు ఉన్నాయని వాటిపై ప్రజల్లో చైతన్యం తీసుకురావడంతోపాటు సంస్కరించాల్సిన అవసరం ఉందని ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు రాజీవ్‌గౌడ అభిప్రాయపడ్డారు. వికాససౌధలో సోమవారం క్లైమేట్ రైజ్ అలయెన్స్ ప్రతినిధులతో కీలక ఒప్పందం చేసుకున్నారు. ఈమేరకు వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు భాగస్వామ్యులయ్యారు. వారిలో జన అర్బన్ స్పేస్ ఫౌండేషన్, డబ్ల్యుఆర్ఐ ఇండియా, జనాగ్రహ, సాలిడ్ వేస్ట్ మేనేజిమెంట్ రౌండ్‌టేబుల్, బయో ఎన్విరాన్‌మెంటల్ ట్రస్టు, ది సెంటర్ ఫర్ స్టడీ ఆఫ్ సైన్స్ టెక్నాలజీ అండ్ పాలసీతోపాటు పలు సంస్థల ప్రతినిధులు భాగస్వామ్యులయ్యారు. రాష్ట్రంలో నగరాలు కలుషితం అవుతున్నాయన్నారు. ప్రస్తుతం చెరువులను ఆక్రమించుకోవడం ద్వారా భూగర్భజలం అడుగంటడంతోపాటు ఎన్నో సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. ఫుట్‌పాత్‌లు సక్రమంగా లేక రోడ్లపై నడకతో ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ప్రతిచోటా కలుషితం అయ్యేందుకు ప్రజలలో అవగాహన లేకపోవడమే కారణమన్నారు. నగరాలలో అపార్ట్ మెంట్‌ల సంస్కృతి పెరుగుతోందని, వాటి వ్యర్థాలను ఏ విధంగా క్రమ బద్ధీకరించాలనేది ప్రణాళిక లేదన్నారు. అపార్ట్‌మెంట్‌లనుంచి వ్యర్థపునీటిని ఇష్టారాజ్యంగా వదిలేస్తున్నారన్నారు. వర్షపునీటి సేకరణకు నిబంధనల చట్టం ఉన్నా అమలు కావడం లేదన్నారు. నీటి కాలువలు కనుమరుగు అవుతున్నాయన్నారు. చెట్ల పెంపకం తగ్గిపోతోందని, పైగా అభివృద్ధి, అడ్డంకి పేరిట ఇష్టారాజ్యంగా పచ్చదనం తొలగిస్తున్నారన్నారు. కేవలం బెంగళూరుకే సమస్య పరిమితం కాలేదని, జిల్లా కేంద్రాలలోనూ ఇదే విధానం కొనసాగుతోందన్నారు. ఇకపై సంస్థలతో కలసి ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చే కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు.



మీడియాతో ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు రాజీవ్‌గౌడ, క్లైమేట్ రైజ్ ప్రతినిధులు

ఆక్రమణలు స్వచ్ఛందంగా తొలగించండి



స్థానికులకు సూచనలు చేస్తున్న పురసభ ముఖ్యఅధికారి మీనాక్షి

బంగారపేట, మార్చి 11: పట్టణంలోని కెరెకోడి గ్రామంలో వారంలోగా ఆక్రమణలు తొలగించాలని పురసభ ముఖ్యఅధికారి మీనాక్షి సూచించారు. పట్టణంలోని పెద్ద చెరువు నిండి మరవపారేందుకు వీలుగా ఉన్న రాజకాలువ ద్వారా అత్తిగిరికొప్ప చెరువుకు వెళ్లేలా ఉన్న పెద్ద రాజకాలువ ప్రస్తుతం చిన్నగా మారిపోయింది. కాలువను ఆక్రమించి ఇళ్లు, షెడ్‌లు నిర్మించారు. ఆక్రమణల కారణంగా చెరువు మరవపారేవేళ నీరు సజావుగా ప్రవహించక ఇళ్లలోకి వచ్చి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మరోవైపు ప్రభుత్వ స్థలాన్ని కాపాడాల్సిన ప్రజా ప్రతినిధులే ఆక్రమణలకు పాల్పడ్డారనే ఆరోపణలు ఉన్నాయి. ఫిర్యాదుల నేపథ్యంలో పురసభ ముఖ్య అధికారి మీనాక్షి సోమవారం స్వయంగా పరిశీలించారు. చెరువు మరవ పారే ప్రదేశంలోనే వాటర్‌ఫిల్టర్‌ను నిర్మించినట్టు గుర్తించారు. తాగునీరు సమకూర్చే నెపంతో ఇలా ఆక్రమణలకు పాల్పడ్డం సరికాదని హెచ్చరించారు. వారంలోగా అన్ని అక్రమ నిర్మాణాలు స్వచ్ఛందంగా తొలగించాలని, లేనిపక్షంలో చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు.

నిరుపేదలకు వరం..

ఉచిత ఆరోగ్యశిబిరాలు

బెంగళూరు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ఉచిత ఆరోగ్య శిబిరాలు నిరుపేదలకు ఎంతగానో మేలు చేస్తాయని సచ్ఛంద సంస్థలు ఈ దిశలో మరిన్ని శిబిరాలు నిర్వహించేందుకు ముందుకు రావాలని పులకేశినగర్ ఎమ్మెల్యే ఎంసీ శ్రీనివాస్ పిలుపునిచ్చారు. బెంగళూరులోని ఎస్‌కే గార్డెన్స్‌లో ఆదివారం రామయ్య ఆసుపత్రి సహకారంతో మాదిగ దండోరా రిజర్వేషన్ల పోరాట జనజాగృతి సమితి , పులకేశినగర కాంగ్రెస్ కమిటీల సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటైన ఉచిత మెగా ఆరోగ్య పరీక్షా శిబిరానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఉదయం 9.30 నుండి మధ్యాహ్నం 3 వరకు జరిగిన ఈ శిబిరంలో 500 మందికి పైగా పాల్గొని ఉచితంగా వైద్యపరీక్షలు చేయించుకున్నారు. కేన్సర్‌తో సహా మొత్తం 16 రకాల ఆరోగ్య సమస్యలకు ఉచిత పరీక్షలు నిర్వహించడంతో పాటు మందులు కూడా ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో మాదిగ దండోరా రిజర్వేషన్ల పోరాట జనజాగృతి సమితి అధ్యక్షుడు ఎంసీ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి సీ దాస్‌తో పాటు జై భీమ్ అధ్యక్షుడు ఎంఎం రాజు, మాజీ కార్పొరేటర్లు జఫ్రుల్లా, శ్రీధర్, కాంగ్రెస్ నేతలు శివా, వేలు తదితరులు పాల్గొన్నారు. ఈ మెగా ఉచిత ఆరోగ్య శిబిరానికి అనూహ్యస్పందన లభించిందని సంస్థ ప్రకటన పేర్కొంది.



జ్యోతి ప్రజ్వలనతో శిబిరాన్ని ప్రారంభిస్తున్న నేతలు

ఘనంగా మహిళా దినోత్సవం




మహిళలకు సన్మానం

బొమ్మనహళ్ళి, మార్చి 11: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని బిలేకహళ్ళి, అరికెరె, పుట్టేనహళ్ళి వార్డులకు చెందిన మహిళా కార్యకర్తలకు బిలేకహళ్ళి బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షుడు అశ్వత్థ నారాయణస్వామి నేతృత్వంలో ఘనంగా సత్కరించారు. సోమవారం ఏర్పాటైన కార్యక్రమంలో పసుపు, కుంకుమ, చీర అందజేసి సుమారు 600మందిని శాలువాతో సత్కరిం చారు. ఏటా అంతర్జాతీయ దినోత్సవాన్ని అర్థవంతంగా ఆచరిస్తున్నట్టు నారా యణ స్వామి తెలిపారు. మహిళలు అన్నిరంగాల్లో ముందుకెళ్తున్నారన్నారు. ప్రధానంగా అందరూ చదువుకుని ఆర్థిక స్వావలంబన సాధించాలని ఆకాంక్షించారు. సోనియాగాంధీ ఒక మహా నాయకురాలిగా కాంగ్రెస్ పార్టీని ముందుకు నడిపించిందన్నారు. కార్యక్రమంలో కేపీసీసీ సభ్యుడు శ్రీనివాసమూర్తి, ఉమాపతిగౌడ, పుట్టేనహళ్ళి వార్డు కాంగ్రెస్ నాయకులు స్టార్ గురుదేవ్, ఉమేశ్‌గౌడ తదితరులు పాల్గొన్నారు.


ఆవిష్కరణలు పెరగాలంటే సమన్వయం కీలకం

బెంగళూరు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ఆవిష్కరణలు వృద్ధి చెందాలంటే సహకారం, సమన్వయం కీలకమని పీపుల్ ప్లస్ ఏఐ ఫెలో సోనికాచౌదరి అభిప్రాయపడ్డారు. నగరంలో 30మందికిపైగా పారిశ్రామికవేత్తలు, స్టార్టప్‌లకు పెట్టుబడులపై సమీక్ష జరిపారు. బ్రిడ్జింగ్ గ్యాప్స్ టు ఎమర్జింగ్ సొల్యూషన్స్ పేరిట సదస్సు జరిగింది. భారత్ క్లైమేట్ స్టార్టప్ సహకారంతో జరిగిన సదస్సులో పలువురు పారిశ్రామికవేత్తలు అభిప్రాయం మేరకు పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యత, ఇంక్యుబేటర్‌లు అవసరమన్నారు. స్టార్టప్‌లకు అవసరమైన పెట్టుబడులు ముఖ్యమని తీర్మానించారు.



సదస్సులో పాల్గొన్న పారిశ్రామికవేత్తలు

ఐదు గ్యారెంటీలతో మెరుగైన జీవన ప్రమాణం



సమావేశానికి బయల్దేరుతున్న స్థానికులు

విజయపుర, మార్చి 11: కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ఐదు గ్యారెంటీ పథకాలతో ప్రజల జీవన ప్రమాణం మెరుగైందని పురసభ మాజీ అధ్యక్షుడు, ప్రస్తుత సభ్యుడు ఎం సతీశ్‌కుమార్ పేర్కొన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం నుంచి ఆలూరు దుద్దనహళ్ళి వద్ద ఏర్పాటైన ఐదు గ్యారెంటీ పథకాల లబ్ధిదారుల సమావేశానికి బయల్దేరుతూ మాట్లాడారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, గృహలక్ష్మి పథకం కింద కుటుంబంలోని ముఖ్యులకు రూ.2వేలు, అన్నభాగ్య ద్వారా ఐదు కేజీల బియ్యం, మరో ఐదు కేజీలకు నగదు, గృహజ్యోతి పథకంతో ఉచిత విద్యుత్, నిరుద్యోగ యువతకు ప్రోత్సాహకం ఇస్తోందన్నారు. గత శాసనసభ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేసి మాట నిలబెట్టుకుందన్నారు. ఈ సందర్భంగా పురసభ సభ్యుడు నందకుమార్, స్థాయి సమితి మాజీ అధ్యక్షుడు ముని చిన్నప్ప, మాజీ సభ్యులు మునికృష్ణప్ప, సంపత్‌కుమార్, హరీశ్ తదితరులు పాల్గొన్నారు.

నీటిని పొదుపుగా వాడుకోండి

చేళూరు, మార్చి 11: వేసవి నేపథ్యంలో తాలూకా పరిధిలోని 12 గ్రామ పంచాయతీలలో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపట్టేందుకు అధికారులు సమాయత్తమయ్యారు. ఇప్పటికే ఎండల ప్రభావం పెరగడంతో నీటి సమస్య కూడా పెరిగింది. బోర్ల మరమ్మత్తుకు చర్యలు చేపడుతున్నట్టు అధికారులు తెలిపారు. గ్రామపంచాయతీల స్థాయిలో నీటి సమస్య పరిష్కారానికి కార్యాచరణ చేపట్టారు. నీటి కొరత దృష్ట్యా ఉన్న నీటిని పొదుపుగా వాడుకో వాల్సిందిగా చాటింపు వేయదలిచారు. నీటిని వృథా చేయకుండా తగిన చర్యలు చేపట్టేలా పంచాయతీ అధ్యక్షులు ఇప్పటికే సూత్రప్రాయంగా తీర్మానించారు.

15 నుంచి రాష్ట్రంలో ప్రధాని పర్యటన

బెంగళూరు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల ప్రచారానికి ప్రధాని నరేంద్రమోదీ రాష్ట్రపర్యటన మరో నాలుగైదు రోజుల్లోనే ఆరంభం కానుంది. ఈనెల 15నుంచి 19వరకు కర్ణాటకతోపాటు దక్షిణాది రాష్ట్రాల్లో ప్రధాని పర్యటించే అవకాశం ఉంది. తాత్కాలికంగా అందిన షెడ్యూల్ ప్రకారం 15న కోలారు, 17న శివమొగ్గ, 18న బీదర్, 19న ధారవాడలో పర్యటించనున్నారు. వీటితోపాటు ఉత్తర కర్ణాటక ప్రాంతంలో మరో చోట ప్రధాని పర్యటన ఉంటుందని తెలుస్తోంది. లోక్‌సభ అభ్యర్థులను ఖరారు చేసేందుకు ఢిల్లీలో అగ్రనేతలు సిద్ధమయ్యారు. రాష్ట్రం నుంచి యడియూరప్పతోపాటు విజయేంద్ర అక్కడే మకాం వేశారు. పార్టీ కేంద్ర ఎన్నికల కమిటీ రాష్ట్రానికి సంబంధించి ఒకేసారి 28 మంది అభ్యర్థులను ఖరారు చేసే ఆలోచనలో ఉన్నారు. అభ్యర్థులు ఖరారైన తర్వాత ప్రధాని పర్యటనలు ఉంటాయని పార్టీ వర్గాలు అభిప్రాయపడ్డాయి. కాగా హుబ్బళ్ళిలో కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాలశాఖ మంత్రి ప్రహ్లాద్‌జోషి మాట్లాడుతూ ధారవాడతోపాటు ఐదు ప్రాంతాలలో ప్రధాని పర్యటనకు సంబంధించి సమాచారం వచ్చిందన్నారు. ఆదివారం రాత్రి పీఎంఓ కార్యాలయం నుంచి రాష్ట్ర పర్యటనకు సంబంధించిన సమాచారం ఇచ్చారన్నారు. ఒకటి రెండు రోజుల్లోనూ ధారవాడతోపాటు అన్ని చోట్ల సభా వేదికలు ఖరారు చేస్తామన్నారు. గతంలో ప్రధాని మోదీ ధారవాడకు వచ్చినప్పుడు చారిత్రాత్మకమైన రీతిలో సభ జరిగిందన్నారు. మరోసారి అంతకుమించి ఏర్పాట్లు చేస్తామన్నారు. రాష్ట్రంలో జేడీఎస్‌తో పొత్తుతోపాటు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పట్ల ప్రజలు విశ్వాసంతో ఉన్నారన్నారు. ప్రస్తుతం ఉన్న ఎంపీల తరహాలోనే భవిష్యత్తులోనే అత్యధిక స్థానాల్లో గెలుపు మాదేనన్నారు. అనంతకుమార్ హెగ్డే వ్యాఖ్యలపై స్పందించేది లేదంటూ దాటవేశారు.

రాఘవేంద్రస్వామి మఠంలో సుధామూర్తి పూజలు



అర్చకులచే ఆశీస్సులు అందుకుంటున్న డా.సుధామూర్తి

బెంగళూరు, మార్చి 11(ఆంధ్రజ్యోతి): రాజ్యసభకు నామినేట్ అయిన ఇన్ఫోసిస్ ఫౌండేషన్ అధ్యక్షురాలు డా. సుధామూర్తి సోమవారం బెంగళూరు జయనగర ఐదో లేఅవుట్‌లోని నంజనగూడు రాఘవేంద్రసామి మఠాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఇన్ఫోసిస్ సంస్థాపకుడు భర్త నారాయణమూర్తి కూడా వెంట ఉన్నారు. డా.సుధామూర్తి మఠం సీనియర్ మేనేజర్‌రాజా వాదీంద్రాచార్య ఆత్మీయ స్వాగతం పలికారు. మఠంలో డా.సుధామూర్తి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. డా.సుధామూర్తి తరచూ ఈ మఠంలో ఒక సామాన్య భక్తురాలిగా సేవలందిస్తున్నారు.

ఉత్సాహభరితంగా విద్యానికేతన్ వార్షికోత్సవం



వేదికపై ప్రముఖులకు సన్మానం

బెంగళూరు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): నగరంలోని సుంకదకట్ట విద్యానికేతన్ ప్రీ ప్రైమరీ పాఠశాల వార్షికోత్సవం నగరంలో ఘనంగా జరిగింది. రోటరీ భారత్ విస్తార అధ్యక్షుడు డా.రాఘవేంద్ర శ్యామ లీలా ఈ ఉత్సవాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ చిన్నప్పటి నుండే క్రమశిక్షణ, నైతిక విలువల బోధన విద్యార్థులకు అందించే దిశలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమన్నారు. ఈ సందర్భంగా చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. విద్యానికేతన్ అధినేతలు కెహెచ్.ధనుంజయ, గంగమ్మ, డీటీ రశ్మి, మిధున్‌కుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయిని ఆర్ లత తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఫిట్టీ ఇంజనీరింగ్ చేతికి బగాడియా

బెంగళూరు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): తుమకూరుకు చెందిన బగాడియా చైత్ర ఇండస్ట్రీస్‌ను ఫిట్టీ ఇంజనీరింగ్ లిమిటెడ్ వందశాతం ఈక్విటీ షేర్‌లతో టేకోవర్ చేసుకుంది. వీటి మార్కెట్ విలువ రూ.124.90 కోట్లుగా ఉంది. ఈమేరకు ఉభయ సంస్థలు ఒప్పందపత్రాలపై నగరంలో సోమవారం సంతకాలు చేశాయి. ఫిట్టీ ఇంజనీరింగ్ సంస్థ ఉపాధ్యక్షుడు అక్షయ్ ఎస్ ఫిట్టీ ఈ మేరకు నగరంలో ఒక ప్రకటన విడుదల చేశారు. దక్షిణభారతదేశంలో కార్యకలాపాలు విస్తరించేందుకు ఈ ఒప్పందం అత్యంత కీలకం కానుందని ప్రకటనలో పేర్కొన్నారు.

ఎఫ్‌కేసీసీఐ ఆధ్వర్యంలో నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం

బెంగళూరు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక వాణిజ్య పరిశ్రమల సమాఖ్య ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం మంగళవారం జరుగనుంది. సమాఖ్య అధ్యక్షుడు రమేష్‌చంద్ర లహోటి అధ్యక్షత వహించనుండగా ఇస్రో డిప్యూటీ డైరెక్టర్ ఎస్.రామలక్ష్మి, నటి ఆర్‌జె శ్రద్ధ గౌరవ అతిథులుగా పాల్గొననున్నారు. సమాఖ్య ప్రాంగణంలోని ఎంవీ ఆడిటోరియంలో ఈ వేడుక సాయంత్రం 4 గంటలకు ప్రారంభం కానుందని ఇక్కడ విడుదలైన ప్రకటన పేర్కొంది.

21న ఐఐబీఎస్ సంస్థాపనా దినోత్సవం

బెంగళూరు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బిజినెస్ స్టడీస్ (ఐఐబీఎస్) సంస్థాపనా దినోత్సవం దేవనహళ్ళి అంతర్జాతీయ విమానాశ్రయం సమీపాన గల ముత్తుగదహళ్ళి క్యాంపస్‌లో ఈ నెల 21న జరుగనుంది. ఐఐబీఎస్ డైరెక్టర్, ప్రిన్సిపాల్ డా.త్రిపురనేని జగ్గయ్య నగరంలో సోమవారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. లుమినాన్స్ 2024 వేడుక మధ్యాహ్నం 3.30 గంటలకు ప్రారంభం కానుందని సంస్థ 16 ఏళ్ళ మజిలీకి అద్దం పట్టేలా ఈ కార్యక్రమం ఉంటుందని పలువురు ప్రముఖులు పాల్గొంటారని ప్రకటనలో తెలిపారు. తమ సంస్థ నేషనల్ అసెస్‌మెంట్ అక్రిడేషన్ కౌన్సిల్ (నాక్)చే ఎ గ్రేడ్ పొందిందన్నారు.

ఫాం హౌస్‌లో 20కి పైగా పుర్రెలు లభ్యం

- పోలీసుల అదుపులో అనుమానాస్పద వ్యక్తి

బెంగళూరు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): రామనగర్ జిల్లా బిడది తాలూకా జోగరదొడ్డి గ్రామానికి అనుబంధంగా ఉండే ఫామ్ హౌస్‌లో 20కు పైగా మనిషి పుర్రెలు లభించాయి. రంగంలోకి దిగిన పోలీసులు బలరాం అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. బలరాం మంత్రాలు వేయడంతో పాటు రాత్రి వేళల్లో స్మశానంలో పుర్రెలకు పూజలు చేసేవారని పోలీసులకు గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. గ్రామస్తులు ఫిర్యాదు మేరకు సోమవారం ఫాంహౌస్‌ను సందర్శించారు. హోమకుండం చుట్టూ పుర్రెలను జోడించిన విషయాన్ని గుర్తించారు. భద్రకాళి ఫోటోతో పాటు ఎముకలు కూడా ఉన్నాయి. ఏకంగా 20కు పైగా పుర్రెలను పోలీసులు గుర్తించిన పోలీసులు బలరాంను అదుపులోకి తీసుకున్నారు. కొన్నేళ్ళకాలంగా ఇతడు స్మశానంలో పూజలు చేసేవారని గ్రామస్తుల ద్వారా తెలుస్తోంది. అందుకు సంబంధించిన ఫోటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.

9వ తరగతి విద్యార్థిపై ర్యాగింగ్

దొడ్డబళ్ళాపుర, మార్చి 11: తాలూకాలోని గొల్లహళ్ళి సమీపాన గల మొరార్జీ దేశాయ్ వసతి పాఠశాలలో 9వ తరగతి విద్యార్థిపై ర్యాగింగ్ చేసిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. సదరు విద్యార్థికి ఒకరకమైన కలుషిత పాలు ఇచ్చి హత్యకు ప్రయత్నించారనే ఆరోపణలు వినిపించాయి. నిర్వహణా వైఫల్యమే కారణమనే వసతి పాఠశాల ప్రిన్సిపాల్, వార్డెన్, ఆరోగ్య సహాయకులపై సోమవారం ఫిర్యాదు నమోదైంది. తీవ్ర అస్వస్థతకు గురైన విద్యార్థి నాగార్జునను బెంగళూరు ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించారు. బాలుడి పరిస్థితి విషమంగా ఉందని తెలుస్తోంది. సామాజిక పోరాటనేత బీఆర్ భాస్కర్‌ప్రసాద్ సోదరి కుమారుడు నాగార్జున. నాగార్జున తండ్రి కన్నుమూయడంతో అతడి బాగోగులను మేనమామ భాస్కర్ ప్రసాద్ చూసుకుంటున్నాడు. ప్రస్తుతం భాస్కర్‌ప్రసాద్ ఫిర్యాదు మేరకు దొడ్డబళ్ళాపుర రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. స్థానికంగా ఈ ఘటన కలకలం చెలరేగింది. విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడేలా వ్యవహరించేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్న డిమాండ్ సర్వత్రా వ్యక్తమైంది.